ఉచిత బస్సు ఎక్కితే కస్సుబుస్సు

- సీట్లు ఖాళీ లేవని బస్సు నుంచి దించేస్తున్న వైనం
- ప్రయాణికులపై డ్రైవర్లు, కండెక్టర్ల చిన్నచూపు
- బస్టాండ్ల వద్ద మహిళల పడిగాపులు
- మహిళలకు తప్పని ఇక్కట్లు



గుర్రంకొండలో ఆర్టీసీ బస్సుల కోసం మహిళలు, ప్రయాణికుల ఎదురుచూపు

మహిళా ప్రయాణికులకు ఉచిత బస్సు కష్టాలు తప్పడంలేదు. కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణం కష్టాలు తెచ్చిపెడుతోంది. ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టు బస్సులను ఏర్పాటు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. అరకొర బస్సులను నడుపుతూ సూపర్ సక్సెస్ అని కూటమి నాయకులు డబ్బా కొడుతున్నారు. దసర పండుగ కోసం పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు వచ్చిన వారికి తిరుగు ప్రయాణం కష్టంగా మారింది. మహిళలు గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. బస్సు ఎక్కితే.. కండక్టర్లు, డ్రైవర్లు కస్సు బస్సులాడుతూ సీట్లు ఖాళీగా లేవు అని దించేస్తున్నారు. దీంతో ఈ ఉచిత ప్రయాణ కష్టాలు వద్దరా బాబూ అని మహిళలు వాపోతున్నారు.

గుర్రంకొండ: బస్సులో సీట్లు లేవు దిగేయండి అంటూ ఆర్టీసీ సిబ్బంది మహిళలను బస్టాండులో దించేసిన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో చోటు చేసుకుంది. దీంతో ఉచిత ప్రయాణమైనా తగినన్ని బస్సు సర్వీసులు లేక పోవడంతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఇబ్బందులు తప్పడం లేదు. గుర్రంకొండ పట్టణం వ్యాపార కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతోంది. నాలుగు మండలాలకు మధ్యలో ఉండడంతో ప్రతిరోజు వందలాది మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఈనేపథ్యంలో ఆదివారం సాయంకాలం పెద్ద ఎత్తున మహిళలు బస్టాండుకు చేరుకొన్నారు. వివిధ మార్గాల్లో ప్రయాణించడానికి ఆర్టీసీ బస్సుల కోసం వేచి చూడసాగారు. అయితే ఏ బస్సు వచ్చిన మహిళలకు సీట్లు లేవు అంటు ఎక్కించుకోలేదు. దీంతో మహిళలు ఆర్టీసీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటల తరబడి బస్టాండులో బస్సుల కోసం వేచి చూస్తున్నా ఒక్క బస్సులో కూడా మహిళలకు ఎక్కించుకోకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. దసరా శెలవులు ముగియడంతో పాటు ఆదివారం రోజు కావడంతో మహిళలు ప్రయాణాల కోసం బస్టాండుకు చేరుకొన్నారు. రోడ్లపై బస్సుల కోసం వేచి చూసి విసిగి వేశారి పోయారు. కొన్నిబస్సుల్లో అప్పటికే ప్రయాణికులతో నిండిపోవడంతా మహిళలను బస్సులోకి రానీయకపోవడం గమనార్హం. తాము అత్యవసర పనిమీద వెళుతున్నాం.. సీట్లు లేకపోయినా నిలబడి వెళ్లామని బతిమిలాడుకొన్నా ఆర్టీసీ సిబ్బంది ససేమిరా అంగీకరించక పోవడం విమర్శలకు దారితీస్తోంది. దీంతో ఉచితప్రయాణం అని బోర్డులు పెట్టనేల, మాకు ఈ కష్టాలు రానేల అంటూ మహిళలు ఉసూరుమని వెళ్లిపోయారు. కాగా కొంతమంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు వెళ్లిపోవడం కొసమెరుపు.

ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండు కిటకిట

మదనపల్లె సిటీ: దసరా సెలవులు పూర్తికావడంతో ఆదివారం మదనపల్లె ఆర్టీసీ బస్టాండు ప్రయాణికులతో కిటకిటలాడింది. దూరప్రాంతాలకు వెళ్లే వారు బస్సుల కోసం పడిగాపులు కాశారు. బస్సులో సీట్ల కోసం పడరానిపాట్లు పడ్డారు. ప్రధానంగా బెంగళూరు, కడప, విజయవాడ, తిరుపతి, చిత్తూరు ప్రాంతాలకు వెళ్లేవారు బస్సుల కోసం వేచిచూడాల్సి వచ్చింది. బెంగుళూరుకు అదనంగా బస్సు సర్వీసులు నడిపినా ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే బెంగళూరు బస్టాండు వద్ద కూడా ప్రయాణికులతో కిటకిటలాడింది.



ఆర్టీసీ బస్సులో సీట్లు లేక మహిళా ప్రయాణికుల అవస్థలు



మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల కష్టాలు

నకిలీ మద్యం కలకలం

అంగళ్లు మద్యం షాపులో ఎక్సైజ్ తనిఖీలు

కురబలకోట: రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలాన్ని సృష్టించిన ములకలచెరువు నకిలీ మద్యంపై ఎక్సైజ్ ఉన్నతాధికారులు విభిన్న కోణాల్లో విచారణ చేపట్టారు. ముఖ్యంగా కురబలకోట మండలం కదిరి రోడ్డులోని రుద్ర వైన్స్ మద్యం షాపును రెండు రోజులుగా ఎక్సైజ్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పరిసర ప్రాంతాల్లో నకిలీ మద్యంకు సంబంధించి ఖాళీ సీసాలు, పార్సిల్ బాక్సుల కోసం క్షుణ్ణంగా పరిశీలన జరిపారు. ఈషాప్‌లో తంబళ్లపల్లె టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జిగా చెప్పుకుంటున్న ఓ కీలక నాయకుడికి భాగస్వామ్యం ఉందన్న అనుమానంతో ప్రత్యేక ఫోకస్ పెట్టారు. రికార్డులు పరిశీలించారు. స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ములకలచెరువు నకిలీ మద్యం ఏమైనా ఇక్కడి దాకా వచ్చి ఈ షాప్ ద్వారా క్రయ విక్రయాల జరిగాయా అన్న దానిపై లోతుగా విచారించారు. పల్లెలకు వెళ్లి బెల్ట్ షాప్‌లలో సైతం నకిలీ మద్యం కోసం గాలించారు. మద్యం తాగే వారిని సైతం వారి ఇళ్లకు వెళ్లి అడిగి విచారించారు. ఎక్కడైనా ఆధారాలు దొరకవచ్చని గాలిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

అధికార పార్టీ వారి నకిలీ మద్యం వెలుగు చూడటం మరో వైపు ఎక్సైజ్ అధికారులు ఇన్నాళ్లు పట్టించుకోకుండా ఇప్పుడు హడావుడి చేయడంపై ప్రజలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చగా మారింది. అధికారులు నిష్పక్ష పాతంగా విచారణ జరిపితే నకిలీ మద్యం లింకులు ఎంత దూరం వెళ్లాయో వెలుగు చూసే అవకాశం ఉందని అధికార ప్రతిపక్ష పార్టీలు చెబుతున్నాయి. నకిలీ మద్యం రహస్యాలు ఇంకెన్ని బయటపడతాయోనని ఆసక్తిగా, ఆపై ఉత్కంఠ భరితంగా ఎదురు చూస్తున్నారు. అధికార పార్టీలోని పెద్దల అండదండలతోనే నకిలీ మద్యం రాకెట్ నడిచిందని నియోజకవర్గంలోని వివిధ వర్గాల వారు భావిస్తున్నారు.

క్లుప్తంగా

మిట్స్‌లో నేడు మెగా ల్యాప్ టాప్-టెక్నో గాడ్జెట్స్ ఎక్స్‌పో

కురబలకోట: మదనపల్లె సమీపంలోని అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో సోమవారం ఉదయం పది గంటల నుండి మెగా ల్యాప్ టాప్, టెక్నో గాడ్జెట్స్ ఎక్స్‌పో-25 నిర్వహిస్తున్నట్లు వీసీ యువరాజ్ తెలిపారు. ఈ గ్రాండ్ ఎగ్జిబిషన్‌లో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్రముఖ బ్రాండ్‌ల ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, స్మార్ట్ పరికరాలు ప్రదర్శిస్తారని తెలిపారు. ఫ్రీ బుకింగ్‌కు అవకాశం ఉందన్నారు. టెక్ ప్రేమికులు, విద్యార్థులతో పాటు ఇతర విద్యా సంస్థల వారు కూడా అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

వైభవంగా పవిత్ర ప్రతిష్ట

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురంలో వెలసిన శ్రీ పట్టాభిరామాలయ పవిత్రోత్సవాలలో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు వైభవంగా వేదమంత్రోచ్చారణలు, ఆగమోక్తంగా పవిత్ర ప్రతిష్ఠకావించారు. ఈ సందర్భంగా ఉదయం యాగశాల వైదిక కై ంకర్యములు, అనంతరం పవిత్ర ఆలయ ప్రదక్షిణల అనంతరం ప్రతిష్ఠంచారు. 10.30 గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. తిరిగి సాయంత్రం 5 గంటలకు యాగశాల కై ంకర్యములు నిర్వహించారు. ఉత్సవాలలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

గర్నిమిట్ట యల్లమ్మతల్లికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో గర్నిమిట్ట యల్లమ్మతల్లి

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట గ్రామ దేవత యల్లమ్మతల్లికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పలువురు భక్తులు బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

ఉలవల గంగమ్మకు మొక్కులు చెల్లింపు



కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పీలేరు : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు కావడంతో మండలంలోని తలపుల పంచాయతీ ఉలవల గంగమ్మకు వైఎస్సార్‌సీపీ నాయకులు మొక్కులు చెల్లించారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 101 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో సురేంద్రనాయుడు, శంకర్‌నాయుడు, రిజ్వానుల్లా, మహబూబ్‌బాషా, రవీంద్రరెడ్డి, జహిరుల్లా, అక్బర్, హారున్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

మునిగోపాలకృష్ణకు రాష్ట్ర స్థాయి అవార్డు



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న మునిగోపాలకృష్ణ

మదనపల్లె సిటీ: వయో వృద్ధుల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రభుత్వం సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మునిగోపాలకృష్ణకు రాష్ట్ర స్థాయి ఉత్తమ సీనియర్ సిటిజెన్ అవార్డును ప్రకటించారు. గుంటూరులో ఆదివారం జరిగిన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి మెమెంటో, ప్రశంసా పత్రం అందజేశారు. మునిగోపాలకృష్ణను మదనపల్లె సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సర్వీసులో స్త్రీశక్తి పథకం కింద మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు ఉదయం 5.30 గంటలకు, 6.30 గంటలకు మదనపల్లె డిపో నుంచి బయలుదేరి మల్లయ్యకొండకు చేరుతాయన్నారు. తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుస్తుందన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

వేధింపులే లక్ష్యం..అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలను వేధింపులే లక్ష్యంగా పని చేస్తోంది తప్ప అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పీలేరుకు చెందిన బోడేషావలి కుమార్తె వివాహానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని అగ్రహారం పంచాయతీ ఎల్లెలవారిపల్లెలో అనారోగ్యంతో ఉన్న జయరామిరెడ్డిని పరామర్శించారు. దొడ్డిపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లెలో నారే వెంకటరమణారెడ్డి కుటుంబంలో శుభకార్యానికి హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 30 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు గుర్తుకొచ్చేలా ఒక్క పథకం కూడా ఇప్పటి వరకు లేదని విమర్శించారు. ఆయన రాజకీయ జీవితమంతా కుట్రలు, కుతంత్రలు, వెన్నుపోటుతోనే గడిపేశారన్నారు. రాష్ట్ర అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రధానంగా వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం, అణచివేయడం, భూఆక్రమణలు చేయడానికే సమయం సరిపోయిందన్నారు. రాష్ట్ర ప్రజలు అంతా గమనిస్తున్నారని, సరైన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి, మునిరెడ్డి, రూపేంద్రరెడ్డి, వినోద్‌కుమార్‌గౌడ్, శ్రీరామరాజు, వాసుదేవరాజు, రెడ్డెప్పరెడ్డి, సుబ్బారెడ్డి, నారే వెంకటరమణారెడ్డి, అశోక్‌రెడ్డి, హరినాథరెడ్డి, హరి, కరీముల్లా, విజయకుమార్‌నాయుడు, నారే రామకృష్ణారెడ్డి, చక్రధర్, ద్వారకనాథరెడ్డి, లోకనాథరెడ్డి, కుసుమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టణ పరిధిలోని కొత్తపేటకు చెందిన పట్టాభి రాయాల విశ్రాంత ఉద్యోగి మొండెం గోపీనాథ్ భార్య లలితమ్మ మృతి సమాచారంతో ఆదివారం ఉదయం వారి ఇంటికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి లలితమ్మ మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతల శివానందరెడ్డి, సీనియర్ నాయకులు చింతల ఆనందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నీళ్ళ భాస్కర్, జే.క్రిష్ణమూర్తి తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

సీవీ మోహన్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ



సి.వి. మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : మండలంలోని వగ్గలకు చెందిన ఉమ్మడి రాష్ట్ర మాజీ అడ్వకేట్ జనరల్ సి.వి. మోహన్‌రెడ్డి తల్లి చింతల సుభద్రమ్మ పది రోజుల క్రితం మృతి చెందారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వగ్గలకు చేరుకుని సి.వి. మోహన్ రెడ్డిని కలసి పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, సి.కె. యర్రమరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జయరాచంద్రయ్య, రామకొండారెడ్డి, దిగువగల్ల శ్రీనివాసులు రెడ్డి, రఘునాథరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పి. ద్వారకనాథరెడ్డి, డాబాబాబు, ఖాదర్‌బాషా, శ్రీనాథరెడ్డి, రవిచంద్రారెడ్డి, సంజీవరెడ్డి, అప్పిరెడ్డి, గౌస్, జగదీష్, వేణుగోపాల్, మహేష్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

పీలేరుకు ఏడు స్వచ్ఛాంధ్ర అవార్డులు



స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపికైన పీలేరు ఏరియా ఆస్పత్రి

పీలేరురూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర 2025కు సంబంధించి పీలేరు నియోజకవర్గానికి ఏడు స్వచ్ఛాంధ్ర ఆవార్డులు వచ్చినట్లు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర 2025 జిల్లా స్థాయి అవార్డుల్లో పీలేరు నియోజకవర్గం ఏడు అవార్డులు గెలుచుకుందని తెలిపారు. ఇందులో పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏరియా ఆస్పత్రి, కామాటంవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రం, కేవీపల్లెలో గ్యారంపల్లె ఆయుష్ ఆస్పత్రి, పీలేరు మండలం ముడుపులవేముల గ్రామ సమాఖ్య, వాల్మీకిపురం అయ్యవారిపల్లె గ్రామ మహిళా సమాఖ్య, గుర్రంకొండ గ్రామ పంచాయతీ ఎంపికైనట్లు వివరించారు. సోమవారం జిల్లా కేంద్రంలో అవార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

రాయచోటి: సుదీర్ఘకాలం పాటు విద్యారంగానికి ఉపాధ్యాయులు అందించిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. రాయచోటిలోని డైట్‌లో ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎస్టీయు ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన, ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల ఆత్మీయ అభినందన సన్మాన సభను ఏర్పాటు చేశారు. భావి భారతావనికి ఉత్తమ పౌరులను అందించే ఉపాధ్యాయులు దీపపు స్తంభం లాంటి వారని వారు అభివర్ణించారు.

65 మంది ఉపాధ్యాయులకు సన్మానం..

రాయచోటి రీజన్‌లో పదవీ విరమణ పొందిన జాతీయ, రాష్ట్ర అవార్డు పొందిన దాదాపు 65 మంది ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. వారు చేసిన సేవలను ప్రత్యేకంగా కొనియాడారు.

జేసీబీ యంత్రాలతో ఉపాధిపనులు

– చోద్యం చూస్తున్న అధికారులు



శెట్టివారిపల్లెలో జేసీబీతో పొలంలో గుంతలు తవ్విన దృశ్యం

గుర్రంకొండ: కూలీలు చేయాల్సిన ఉపాధిహామీ పనులు జేసీబీ యంత్రాలతా చేసి కొంతమంది బిల్లులు చేసుకొంటున్న సంఘటన మండలంలోని శెట్టివారిపల్లెలో జరిగింది. కళ్ల ముందే ఈ తంతు జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తుకాలం వెళ్లదీస్తుండడం గమనార్హం. ఉపాధిహామీపథకం ఈఏడాది మొక్కలు, వివిధ రకాల తోటల పెంపకం పనులు చేపడుతున్నారు. ఇందులోభాగంగా మామిడితోటలు పెంపకంకు ఉపాధిహామీపథకం కింద నిధులు మంజూరయ్యాయి. దీంతో పలువురు రైతులు శెట్టివారిపల్లె పంచాయతీ పరిధిలో మామిడి తోటల పెంపకం చేపడుతున్నారు. ముందుగా పొలంలో నిబంధనల మేరకు కొలతలతా ఉపాధి హామీ కూలీల చేత గుంతలు తవ్వించాలి. పొలం మొత్తం మీద కూలీలు గుంతల తవ్వకం పనులను పూర్తి చేసిన తరువాత మొక్కలు నాటాల్సి ఉంది. గుంతలు తవ్వే సమయంలో ప్రతి రోజు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ కూలీల పేర్లు, పనుల వివరాలు మస్టర్లలో పొందుపరచాల్సి ఉంటుంది. అయితే గ్రామానికి చెందిన కొంతమంది అక్రమార్కులు రాత్రికి రాత్రే జేసీబీలతో గుంతలను తవ్వేశారు. కూలీలతో చేయించాల్సిన పనులను జేసీబీ యంత్రాలతో చేయించడం గమనార్హం. గుంతలు తీయించిన వెంటనే మొక్కలు నాటే ప్రక్రియ ఆఘామేఘాల మీద పూర్తి చేశారు. పనులను అడ్డుకోవాల్సిన ఉపాధి హామీ అధికారులు అక్రమార్కులు జేసీబీలతో పనులు చేసిన వెంటనే మొక్కలు కూడా ఇవ్వడం పలు విమర్శలకు దారి తీస్తోంది. గుంతలను జేసీబీ యంత్రాలతో చేసిన ఆనవాళ్లు పొలంలో స్పష్టంగా కనిపిస్తుండడం గమనార్హం. అయినా ఇవేవి పట్టనట్లు సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై ఏపీవో జయరామిరెడ్డిని వివరణ కోరగా ఈవిషయం తమ దృష్టికి రాలేదన్నారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపించి వాస్తవమని తేలితే బిల్లులు నిలిపివేస్తామన్నారు.

జిల్లా సాధన కోసం 26న ఆందోళన

-రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డిసాహెబ్

మదనపల్లె: మదనపల్లె జిల్లా సాధన కోసం ఈనెల 26 నుంచి ఆందోళన కార్యక్రమాలను ప్రారంభించాలని ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయించింది. ఈ సందర్భంగా వివిధ పార్టీలు, సంఘాలకు చెందిన నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్‌లు మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామని హామీలు ఇచ్చి విస్మరించారన్నారు. ఎన్నికల్లో హామీని నమ్మి ప్రజలు ఓట్లు వేశారన్నారు. ప్రాంతాల స్వరూపాల చేర్పులు, మార్పులపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటిదాక మదనపల్లెలో పర్యటించలేని నాయకులు నిరసన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం కుంటిసాకులు వెతక్కకుండా తక్షణమే మదనపల్లె జిల్లాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈనెల 26 నుంచి పోరాటాలను తీవ్రతరం చేస్తున్నట్టు ప్రకటించారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్‌నేత ఎస్.రెడ్డిసాహెబ్, మాలమహానాడు అధ్యక్షులు సుదర్శనం, సీపీఐ, సీపీఎం నేతలు మురళీ, ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కే.బాషా, బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బోడెం రాజశేఖర్, గుండాల మనోహర్, మల్లెల మోహన్, మహబూబ్‌పీర్, శరత్‌కుమార్‌రెడ్డి, రవీంద్ర, భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట: మదనపల్లె జిల్లా సాధన కోసం అన్ని పార్టీలు ఉద్యమాలకు సిద్ధం కావాలని పార్టీల నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక షాదీ మహల్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు చంద్రబాబు ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేసేలా మదనపల్లె జిల్లాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మనసు మారితేనే కొత్త జీవితం



అంగళ్లు మందిరంలో మాట్లాడుతున్న పాస్టర్లు

కురబలకోట: దురలవాట్లు, పాప కార్యాలు, గర్వం, అవిధేయత, దుష్టత్వం వీడి క్రీస్తులో నూతన ఆత్మను పొందిన వారే కొత్త జీవితం గడుపుతారని అంగళ్లు సీయోను ప్రార్థన మందిరం ప్రధాన పాస్టర్ విక్టర్ వేదనాయకమ్, సహ పాస్టర్ పి. శ్యామ్యూల్ పేర్కొన్నారు. ఆదివారం మందిరంలో నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ఆరాధన, బల్లవర్తమానం నిర్వహించారు. వారు వేర్వేరుగా దైవ సందేశమిస్తూ పాతవి గతిస్తేనే నూతనమైనవి పుట్టుకొస్తాయన్నారు. మనసు నుండి మార్పు వచ్చినప్పుడు మాత్రమే జీవితం మారుతుందన్నారు. దురాలోచనలు, అవినీతి, భ్రష్టత్వం, దుర్నీతి, శరీరానుసారమైన ప్రవర్తన ఇవన్నీ మనిషిని దేవుని ప్రేమ నుంచి దూరం చేస్తాయన్నారు. పాప బంధకాల నుంచి మొదట బయటపడాలన్నారు. లోపలి మార్పు బయట ప్రపంచాన్ని మారుస్తుందన్నారు. గర్వాన్ని విడచి వినయాన్ని అవిధేయతను వదిలి విధేయతను పెంపొందించుకోవాలన్నారు. దేవుని మార్గం తొలుత కష్టతరంగా ఉన్నప్పటికీ ఆఖరి వరకు సత్యమైనదిగా ఉంటుందన్నారు. అదే లోకపు మార్గం సులభమైనదిగా కన్పించినా చివరకు నాశనానికి చేరుస్తుందని గుర్తించాలన్నారు. దేవుని భయం కలిగి విశ్వాసంతో నడచుకోవాలన్నారు. నాతాను, తిమోతి, నెహెమ్యా తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలి



అఖిలపక్ష సమావేశంలో నాయకులు

పీలేరు రూరల్ : మదనపల్లెను జిల్లా కేంద్రగా ప్రకటించాలని జిల్లా సాధన సమితి కన్వీనర్ పి.టి.ఎం. శివప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఆరు నెలల్లోనే మదనపల్లెను జిల్లాగా ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని తెలిపారు. అయితే 16 నెలలు పూర్తవుతున్నా మదనపల్లెను జిల్లాగా ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. నియోజకవర్గం నుంచి ఈ నెల 26న ఛలో మదనపల్లె కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాస్ రాష్ట్ర కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు, వివిధ సంఘాల నాయకులు చంద్రయ్య, ధరణికుమార్, సుధాకర్‌బాబు, చంద్రయ్య, మహమ్మద్ షరీఫ్, టి.ఎల్. వెంకటేష్, శ్రీకాంత్, నరేష్, భానుప్రకాష్, గట్టప్ప, మోహన్, వెంకటస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రెడ్డెమ్మతల్లికి పూజలు



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లికి భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ఉదయాన్నే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. భక్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తుల ఆలయమెట్లకు పూజలు చేశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి దర్శించుకోవడం గమనార్హం.